బీజేపీకి భంగపాటు

ఏడు రాష్ట్రాల ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం.. 13 అసెంబ్లీ సీట్లలో కేవలం రెండు చోట్లే గెలుపు

న్యూఢిల్లీ, జూలై 13: దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అత్తెసరు మెజారిటీతో మూడోసారి కేంద్రంలో అధికారంలో చేపట్టిన బీజేపీకి కొద్ది రోజుల్లోనే మరోసారి భంగపాటు కలిగింది. మొత్తం 13 సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం రెండు చోట్ల మాత్రమే విజయం సాధించింది. దీంతో బీజేపీపై దేశ ప్రజలకున్న వ్యతిరేకత మరోసారి ప్రస్ఫుటమైంది. చాలా స్థానాల్లో కనీస పోటీ ఇవ్వలేక ఆ పార్టీ చతికిలపడింది. బెంగాల్‌లో అధికార టీఎంసీ నాలుగింటికి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఆ రాష్ట్ర సీఎం సుఖు భార్య, కాంగ్రెస్ అభ్యర్థి కమలేష్ ఠాకూర్ బీజేపీ అభ్యర్థిపై 9,399 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాలాగఢ్‌లో కాంగ్రెస్, హమీర్‌పూర్‌లో బీజేపీ నెగ్గాయి. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, కర్ణాటకలోని మంగళూరు స్థానాలు రెండింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్‌ను అధికార ఆప్, బీహార్‌లోని రూపౌలిలో స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ గెలుపొందారు.

బెంగాల్‌లోని రాణాఘాట్‌లో టీఎంసీ కొత్త ఎమ్మెల్యే ముకుత్ మని సంబరాలు

యూపీ బీజేపీలో తిరుగుబాటు: అఖిలేశ్

లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత యూపీ బీజేపీ నేతలు తమ సొంత పార్టీపై తిరుగుబాటు చేశారని, అందులో చాలామంది నేతలు పీపుల్స్ డెమోక్రాటిక్ అలయెన్స్ (పీడీఏ)లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమంలో వీడియో పోస్ట్ చేశారు. ప్రస్తుతం యూపీ బీజేపీ ఒక విధమైన నిరాశ, నిస్పృహలతో నిండి ఉందని, వారికి అలాంటి పరిస్థితి ఏర్పడటానికి పీడీయే కూటమే కారణమని అన్నారు. దాంతో ఆ పార్టీ నేతలు బయటకు రావాలని అనుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగానే ఇప్పటికే పలువురు నేతలు పార్టీకి వ్యతిరేకంగా ప్రకటనలు ఇస్తుండగా, మరికొందరు పార్టీ వేదికలపై తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీజేపీ 2027 ఎన్నికల్లోనే కాదు, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఓడిపోవడం ఖాయమని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు.

యూఎస్‌లో రెండు ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్లు

సీటెల్: అమెరికాలోని సీటెల్, బెల్లెవ్యూలలో ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్ (ఐవీఏసీ)లను శుక్రవారంప్రారంభించారు. సీటెల్‌లోని ఐవీఏసీని మేయర్ బ్రూస్ హ్యారెల్, కాన్సుల్ జనరల్ ప్రకాశ్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా హ్యారెల్ మాట్లాడుతూ... భారత్, అమెరికా మధ్య స్నేహ బంధాన్ని పటిష్టం చేయడంలో భారతీయులు విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రకాశ్ గుప్తా మాట్లాడుతూ, కొత్తగా ఐవీఏసీలను ప్రారంభించడం ద్వారా పసిఫిక్ వాయవ్య రాష్ట్రాలతో సంబంధాలను పెంపొందించుకోవవడలో భారతదేశ నిబద్ధత స్పష్టమవుతున్నదని చెప్పారు.

ఫ్రంట్ లైన్‌లో పోరాడండి

భారత యోధులపై రష్యన్ సైన్యం ఒత్తిడి

మాస్కో: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో నిర్బంధంగా రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులకు ఇప్పటికీ ఉపశమనం దొరకడం లేదు. ప్రధాని మోదీ ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన చర్చల్లో, బలవంతంగా రష్యన్ సైన్యంలో చేరిన భారతీయులను విడుదల చేయాలని పుతిన్‌ను కోరినట్లు, అందుకు ఆయన అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారలేదు. ఓ పత్రిక కథనం ప్రకారం.. పంజాబ్‌కు చెందిన గగన్‌దీప్ అనే వ్యక్తి ఉన్న యూనిట్‌ను ఉక్రెయిన్‌తో యుద్ధం లో ఫ్రంట్ లైన్‌లో పోరాటానికి వెళ్లాలని రష్యన్ ఆర్మీ కమాండర్ ఆదేశించారు.

పింఛనుగా చివరి జీతంలో 50 శాతం!

కేంద్రప్రభుత్వ ఉద్యోగుల కోసం బడ్జెట్లో ప్రతిపాదన!

న్యూఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను మరికొన్ని రోజుల్లో ప్రవేశపెట్టబోతున్నది. దీనిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద పింఛనుపై భరోసా కల్పించబోతున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి తీసుకునే చిట్టచివరి జీతంలో 50 శాతం సొమ్మును పింఛనుగా చెల్లించే విషయం పరిశీలనలో ఉంది. ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పలు విధానాలు, ఏపీ ప్రభుత్వం అమలు చేసిన సర్దుబాట్లను కూడా పరిశీలించింది. చిట్టచివరి జీతంలో 50 శాతం సొమ్మును పింఛనుగా చెల్లిస్తామనే హామీని ఇవ్వడంపై ఏకాభిప్రాయం వస్తున్నది.

రాజ్‌భవన్ ఉద్యోగిపై ఒడిశా గవర్నర్ కుమారుడి దాడి!

భువనేశ్వర్: ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ కుమారుడు లలిత్‌దాస్ తనపై దాడిచేశారని రాజ్‌భవన్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి బైకుంఠనాథ్ ప్రధాన్ ఆరోపించారు. గతవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీ సందర్శించిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. గవర్నర్ సెక్రటరీ సస్వత్ మిశ్రాకు ఆయన ఫిర్యాదు చేస్తూ.. జూలై 7న రాత్రి 11.45 గంటల సమయంలో లలిత్ కోపంతో ఊగిపోతూ అసభ్యంగా తిడుతూ చెంపలు వాయించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బయటపెడితే చంపేస్తానని లలిత్‌కుమార్ హెచ్చరించారని ఆరోపించారు. అయితే, ఇదంతా కుట్ర అని గవర్నర్ సహాయకుడు ఒకరు కొట్టిపడేశారు.

జమ్ము కశ్మీర్‌లో ఎల్జీకి అదనపు అధికారాలు

2019 చట్టంలో కేంద్రం సవరణలు

న్యూఢిల్లీ, జూలై 13: జమ్ము కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను కల్పించింది. దీనిలో భాగంగా జమ్ము కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2019లో కేంద్ర హోం శాఖ కొన్ని సవరణలు చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు కొన్ని ముఖ్యమైన అధికారాలను అదనంగా చేర్చింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. త్వరలో జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న క్రమంలో ఎలాగూ బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేనందున ముందు జాగ్రత్తగా ముఖ్యమైన పలు అధికారాలను ఎల్జీకి కట్టబెట్టే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

సీఎంకు ఇచ్చిన వినతులు చెత్తకుప్పలో..

సిద్ధరామయ్య తీరుపై విమర్శలు

బెంగళూరు, జూలై 13: ముఖ్యమంత్రిని కలిసి కష్టాలు చెప్పుకుంటే తీరుతాయని భావించిన కర్ణాటక రైతులకు చేదు అనుభవం ఎదురైంది. స్వయంగా సీఎంకు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తకుప్పలో కనిపించాయి. ఈ ఘటన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విమర్శలకు కారణమైంది. చామరాజనగరలో జూలై 10న సిద్ధరామయ్య ఓ బహిరంగ సభకు హాజరు కాగా, రైతులు, స్థానికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలను సమర్పించారు. అయితే, ఈ వినతిపత్రాలు తాజాగా ఓ చెత్తకుప్పలో పడి ఉన్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో సిద్ధరామయ్య తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సీఎం నైతిక బాధ్యత తీసుకొని, ప్రజలకు జవాబు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లా కమలమూ తప్పులు చేస్తే ఎలా?

అలాగైతే పవర్‌లోకి వచ్చి లాభముండదు

బీజేపీకి కేంద్ర మంత్రి గడ్కరీ హెచ్చరికలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో భంగపాటుకు గురై, మిత్రపక్షాల సాయంతో అధికారంలోకి వచ్చిన బీజేపీపై సొంతపార్టీ నేతలే విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఈ జాబితాలో తాజాగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా చేరారు. ఇటీవల పనాజీలో జరిగిన గోవా బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మిగతా పార్టీలతో పోలిస్తే, బీజేపీ భిన్నమైన పార్టీ అని, గతంలో కాంగ్రెస్ చేసిన తప్పులనే ఇప్పుడు బీజేపీ చేస్తున్నదంటూ పరోక్షంగా ఎత్తిచూపారు.



తప్పులు చేయొద్దు

'బీజేపీ భిన్నమైన పార్టీ. మిగతా వాటితో పోలిస్తే, బీజేపీకి చాలా ప్రత్యేకత ఉన్నదని నా గురువు, బీజేపీ అగ్రనేత అద్వానీ చెప్పేవారు. కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుల కారణంగానే ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు బీజేపీ కూడా అటువంటి తప్పులే చేస్తే లాభమేంటి? అలాంటప్పుడు అధికారంలో ఉన్నా ప్రయోజనమేంటి? కాబట్టి, బీజేపీ అలాంటి తప్పిదాలకు దూరంగా ఉండాలి' అని గడ్కరీ అన్నారు. సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలే సాయపడుతాయన్నారు. తన స్వరాష్ట్రం మహారాష్ట్రలో కుల రాజకీయాలకు చోటు లేదని, వాటిని ప్రోత్సహించేవారికి గట్టి దెబ్బ తగులుతుందని హెచ్చరించారు.

కేజ్రీవాల్ ప్రాణాలతో బీజేపీ చెలగాటం

ఆయన షుగర్ లెవెల్స్ పడిపోయాయని ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ, జూలై 13: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోగ్యంతో కేంద్రంలోని బీజేపీ చెలగాటం ఆడుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఆరోపించింది. మార్చి నుంచి తీహార్ జైలులో ఉంచిన కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవెల్స్ 50 ఎంజీ/డీఎల్ కన్నా తక్కువకు ఐదుసార్లు పడిపోయాయని, ఆయన బరువు సుమారు 8.5 కేజీలు తగ్గిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌కు నిర్బంధం నుంచి విముక్తి కల్పించి సరైన చికిత్స అందించకపోతే ఆయన ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఆయన ఆరోగ్యంపై తీవ్రంగా కలత చెందుతున్నారని, ఆయన ఎందుకు బరువు తగ్గిపోతున్నారో కారణాలు తెలియడం లేదన్నారు.

మిషిగన్ వర్సిటీ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): సకల జీవజాలానికి నీరే ఆధారం. సౌర కుటుంబంలో నీళ్లు ఉన్నట్టు గుర్తించిన ఏకైక గ్రహం భూమి మాత్రమే. అయితే, భూమి మీద నీరు ఏర్పడటానికి గల కారణమేంటన్న అంశంపై ఏండ్లుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ఏ ఒక్క అధ్యయనమూ కచ్చితమైన అభిప్రాయాలను వెల్లడి చేయలేదు. అయితే, అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీ పరిశోధకులు మాత్రం భూమి మీద నీళ్లు ఏర్పడటానికి గల ప్రాథమిక కారణాలను వెల్లడించారు.

అంగారకుడు(మార్స్), బృహస్పతి గ్రహాల మధ్య గ్రహశకలాల గొలుసు (ఆస్టరాయిడ్ బెల్ట్) ఒకటి ఉంటుంది. ఆ బెల్ట్‌లో డార్క్ కామెట్స్ (ప్రత్యేకమైన తోకచుక్కలు), 60 శాతం మేర భూమిని పోలిన కొన్ని ఆస్టరాయిడ్లు తిరుగుతూ ఉంటాయి.

వీటిలో మంచు రూపంలో భారీ నీటి నిల్వలు ఉన్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. వేల ఏండ్ల కిందట ఈ డార్క్ కామెట్స్, ప్రత్యేక ఆస్టరాయిడ్లు భూమిని ఢీకొట్టడంతో కాలక్రమంలో భూమిపై నీరు ఏర్పడిందని, సన్-వాటర్ సైకిల్‌లో భాగంగా బ్రహ్మాండమైన వానలు పడటంలో నదులు, సముద్రాలు ఏర్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీనిపై మరింత సమాచారం రాబట్టాలంటే లోతైన పరిశోధనలు చేయాల్సి ఉన్నదని పరిశోధనలకు నేతృత్వం వహించిన ఆస్టర్ టేలర్ తెలిపారు. ఈ వివరాలు 'ఐకారస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కెనడాలో వలసదారులకు ఉపాధి కరువు!

టొరొంటో, జూలై 13: కెనడాలో శాశ్వత నివాస హోదా అందుకుంటున్న వలసదారుల్లో అగ్రస్థానంలో ఉన్న భారతీయులు, ఆ దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఉపాధి సంక్షోభానికి విలవిల్లాడుతున్నారు. గత 10 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా ఉపాధి, ఉద్యోగ సంక్షోభం భారతీయుల్ని, అక్కడి వలసదారుల్ని వేధిస్తున్నది. ఐదేండ్లుగా ఆ దేశంలో ఉంటున్న వలసదారుల్లో నిరుద్యోగ రేటు జూన్ 2024 నాటికి 12.6 శాతం నమోదుకాగా, భారతీయ వలసదారుల్లో నిరుద్యోగ రేటు 30 శాతానికి చేరుకుందని 'గ్లోబ్ అండ్ మెయిల్' తాజా నివేదిక పేర్కొన్నది.

17% ఉత్పత్తులకే ఎమ్మెస్పీ

- 83% వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ సాయం అవసరం
- 94 శాతం వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు దక్కడం లేదు
- ప్రైవేటు వ్యక్తులూ ఎమ్మెస్పీకి పంటలను కొనేలా చూడాలి
- కీలక అంశాలు సిఫారసు చేసిన ఎస్బీఐ నివేదిక

న్యూఢిల్లీ, జూలై 13: దేశంలో 94 శాతం వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు వర్తించడం లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఆర్థిక పరిశోధన బృందం నివేదిక పేర్కొన్నది. కనీస మద్దతు ధర వర్తించని పంటలకు మద్దతుగా ప్రత్యామ్నాయ విధానం అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించింది. కేవలం వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటే.. 17 శాతం ఉత్పత్తులకే ఎమ్మెస్పీ వర్తిస్తున్నదని, మిగతా 83 శాతం ఉత్పత్తులకు ప్రభుత్వం సహకారం అందించాలని అభిప్రాయపడింది. ప్రస్తుతం ఉన్న కనీస మద్దతు ధరల విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని పేర్కొన్నది.

ప్రభుత్వ కొనుగోళ్లు అరకొరే

ప్రభుత్వం 22 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేవలం వరి, గోధుమ, పప్పుధాన్యాలు వంటి ఆరేడు పంట దిగుబడులను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నది. మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తిలో ప్రభుత్వం కొనుగోలు చేసేది కేవలం 6 శాతం మాత్రమేనని తెలిపింది. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.56.1 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులకు గానూ ప్రభుత్వం రూ.3.4 లక్షల కోట్ల విలువైన దిగుబడులను మాత్రమే కొనుగోలు చేసిందని పేర్కొన్నది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 71 శాతం వాటా కలిగి ఉన్న కూరగాయలు, పండ్లు, మత్స్య సంపద, లైవ్ స్టాక్, అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర వర్తించడం లేదని పేర్కొన్నది.

ఎమ్మెస్పీ దక్కకపోతే పరిహారం ఇవ్వాలి

పంట దిగుబడులను ప్రైవేటు వ్యక్తులు సైతం ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు లేదా అంతకంటే ఎక్కువకే కొనుగోలు చేసేలా కచ్చితంగా నిబంధన విధించాలని ఎస్బీఐ బృందం సూచించింది. ఒకవేళ ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు పంటను విక్రయించినప్పుడు నష్టపోయే మొత్తాన్ని రైతులకు నేరుగా ప్రభుత్వం పరిహారంగా ఇచ్చే విధానాన్ని ఈ నివేదిక సిఫారసు చేసింది.

ప్రాంతీయ భాషల్లో న్యాయ విద్యను బోధించాలి

సీజేఐ చంద్రచూడ్

లక్నో, జూలై 13: న్యాయ విద్యను ప్రాంతీయ భాషల్లో బోధించాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉద్ఘాటించారు. సరళమైన భాషలో న్యాయ విద్యను ఎలా బోధించాలన్న అంశంపై విద్యావేత్తలతో తరచుగా చర్చిస్తున్నట్టు తెలిపారు. సామాన్య ప్రజలకు సరళమైన భాషలో న్యాయ సూత్రాలను వివరించలేకపోతే న్యాయ వృత్తికి, న్యాయ విద్యకు మధ్య లోటు ఏర్పడుతుందని అన్నారు. లక్నోలో శనివారం ఆయన రామ్ మనోహర్ లోహియా న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో మాట్లాడుతూ.. 'న్యాయ విద్యా బోధనలో మనం ప్రాంతీయ భాషలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాంతీయ సమస్యలకు సంబంధించిన న్యాయ సూత్రాలను కూడా మనం బోధించాలి.' అని పేర్కొన్నారు.

ఏఐతో పర్యావరణానికి ప్రమాదం

- పొదుపుగా వాడకపోతే మానవాళికి కష్టమే
- భారీగా నీటిని తాగేస్తున్న డాటా సెంటర్లు
- శిలాజ ఇంధనాలతో నడుస్తున్న సూపర్ కంప్యూటర్లు
- పెద్ద ఎత్తున వెలువడుతున్న కార్బన్ డయాక్సైడ్
- కృత్రిమ మేధను పొదుపుగా వాడటమే పరిష్కారం

న్యూయార్క్, జూలై 13: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో పైచేయి సాధించేందుకు బహుళ జాతి సంస్థలు పోటీ పడుతున్నాయి. వందల కోట్లు ఖర్చు చేసి కొత్త ఫీచర్లతో ఉచితంగా ఏఐ చాట్‌బోట్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. వినియోగదారులు కూడా ఏఐని ఇష్టారీతిన వాడేస్తున్నారు. చిన్న మెయిల్ చేయడానికి కూడా ఏఐపైనే ఆధారపడుతున్నారు. ఫోటోలను, వీడియోలను సృష్టిస్తున్నారు. చిత్రవిచిత్రమైన ప్రశ్నలు అడుగుతూ టైమ్‌పాస్ చేస్తున్నారు. అయితే, ఏఐ కూడా అమూల్యమైన వనరేనని, దీనిని బాధ్యతగా, పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ఉచితంగానే సేవలు అందిస్తున్నప్పటీ పర్యావరణంపై మాత్రం భారం వేస్తున్నదని చెప్తున్నారు.

పర్యావరణానికి ప్రమాదమేంటి?

డాటా సెంటర్లలోని సూపర్ కంప్యూటర్ల ద్వారా ఏఐ పని చేస్తుంది. మనం ఏఐని అడిగే ప్రతి ప్రశ్నను ప్రాసెస్ చేసి సమాధానం ఇచ్చేది సూపర్ కంప్యూటర్లే. సూపర్ కంప్యూటర్లు పర్యావరణానికి హానికరంగా మారిన శిలాజ ఇంధనాలతో పని చేస్తున్నాయి. వీటి కోసం అణు ఇంధనాన్ని కూడా వినియోగిస్తుంటారు. దీనిపై ఇటీవల హగ్గింగ్ ఫేస్ అనే ఓ సంస్థ అధ్యయనం చేసింది. కేవలం చాట్‌జీపీటీకి చెందిన జీపీటీ3 మాడల్‌కు శిక్షణ ఇచ్చే క్రమంలో 500 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి అయ్యిందని ఈ అధ్యయనంలో తేలింది. ఒక పెట్రోల్ కారు 10 లక్షల కిలోమీటర్లు నడిస్తే ఉత్పత్తయ్యే కార్బన్ డయాక్సైడ్‌కు ఇది సమానం.

నీటి కొరత తప్పదా ?

డాటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లు పని చేసేటప్పుడు విపరీతమైన వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడిని తగ్గించేందుకు భారీగా మంచినీరు అవసరమవుతుంది. దీంతో ఏఐ వినియోగం ఎంతగా పెరిగితే నీటి కొరత కూడా అంతగా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డాటా సెంటర్లలో వినియోగించే నీటిపై అనేక విమర్శలు ఉన్నాయి. ఏ కంపెనీ కూడా డాటా సెంటర్‌లకు ఎంత నీటిని వినియోగిస్తున్నాయని వెల్లడించడం లేదు. అయితే, అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఉన్న డల్లెస్ పట్టణంలో గూగుల్‌కు ఒక డాటా సెంటర్ ఉంది. ఈ మొత్తం పట్టణానికి సరఫరా అవుతున్న నీటిలో పావు వంతు ఈ డాటా సెంటర్‌కు అవసరమవుతున్న విషయం ఓ కేసు ద్వారా వెలుగులోకి వచ్చింది. ఏఐ అందుబాటులోకి రావడం వల్ల సాంకేతికంగా కొన్ని లాభాలు ఉన్నాయి. ఇదే సమయంలో పర్యావరణానికి ఏఐ మరింత భారంగా మారింది. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం వల్ల డాటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లపై భారం తగ్గుతుందని, ఇది పర్యావరణానికి మరో నష్టం చేసేదిగా మారకుండా ఉంటుందని పర్యావరణవేత్తలు అప్రాయపడుతున్నారు.

ప్లాంట్‌జ్మా.. ఎరువు అవసరాన్ని తగ్గిస్తుంది

కరువు ప్రభావాన్ని తగ్గించే పరికరాన్ని అభివృద్ధి చేసిన తుర్కియే విద్యార్థులు

న్యూఢిల్లీ: పంటలపై కరువు, కాటకాల ప్రభావాన్ని తగ్గించే డివైస్‌ను తుర్కియేలోని హైస్కూల్ స్టూడెంట్స్ అభివృద్ధి చేశారు. టీమ్ సెరెస్ అనే ఐదుగురు విద్యార్థుల బృందం తమ స్వస్థలాల్లోని పరిస్థితుల నుంచి స్ఫూర్తి పొంది, ప్లాంట్‌జ్మా అనే పరికరాన్ని తయారు చేశారు. ఈ బృందంలోని స్టూడెంట్ బెయ్‌జా తెలిపిన వివరాల ప్రకారం, ఈ పరికరం తక్కువ ఉష్ణోగ్రతలోని ప్లాస్మాను ఉపయోగించుకుని, పంటలు నిలదొక్కుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది, సాగునీటిని మెరుగుపరుస్తుంది. సాగుకు ముందు విత్తనాలపై ప్లాస్మా ప్రభావం పడటం వల్ల అవి మొలకెత్తే రేటు, ఎదిగే సామర్థ్యం మెరుగుపడతాయి. అంతేకాకుండా తెగుళ్లు, పర్యావరణ ఒత్తిళ్లను తట్టుకునే సత్తా పెరుగుతుంది. సాగు నీటిని ప్లాస్మాతో శుద్ధి చేయడం వల్ల పర్యావరణ హితకరమైన, నైట్రోజన్ పరిపుష్టమైన ఎరువుగా తయారవుతుంది. ఫలితంగా మొక్కల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మా పవర్‌ను ఈ ప్లాంట్‌జ్మా పరికరం రెండు విధాలుగా ఉపయోగించుకుంటుంది. అవి, విత్తనాలను నేరుగా శుద్ధి చేయడం, సాగు నీటిని పరోక్షంగా శుద్ధి చేయడం. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం 40 శాతం వరకు తగ్గుతుంది. పంట ఉత్పత్తులు పెరుగుతాయి. నిలకడైన సాగు పద్ధతులకు ప్రోత్సాహం లభిస్తుంది. గ్రామీణ రైతులు సులువుగా ఉపయోగించగలిగే ఈ ప్లాంట్‌జ్మా డివైస్ దాదాపు రూ.16,000కు అందుబాటులో ఉంటుంది.

కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, సెలబ్రిటీ అతిథుల సమక్షంలో యువ పారిశ్రామిక వేత్తలు అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ముంబైలో జరిగిన పెండ్లి వేడుకలో సెలబ్రిటీలు ఆటపాటలతో సందడి చేశారు.

షెకావత్ స్కైడైవింగ్ సాహసం!

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్(56) లేటు వయసులో పెద్ద సాహసానికి ఒడిగట్టారు. 14 వేల అడుగుల ఎత్తులో ఆకాశంలో వేగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్ సహాయంతో కిందకు దూకి ఔరా అనిపించుకున్నారు. ప్రపంచ స్కైడైవింగ్ దినోత్సవం సందర్భంగా హర్యానాలోని నార్నల్‌లో ఆయన ఈ ఫీట్ చేశారు.

ఉష్ణతాపంతో 'పిడుగుల' వాన

వాతావరణ మార్పులతో పెరుగుతున్న తుఫానులు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వేడి పెరుగుతున్నది. ఈ పెరిగిన వేడి మరింత ఉరుములతో కూడిన తుఫానులకు దారి తీస్తున్నది. తత్ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా 'మెరుపు' దాడులు సంభవిస్తున్నాయని సీనియర్ సైంటిస్టులు తెలిపారు. శుక్రవారం పిడుగుపాటుకు బీహార్‌లో 21 మంది, యూపీలో గురువారం 43 మంది మరణించారు. ప్రస్తుతం పెరుగుతున్న భూతాప పరిస్థితులను పరిశీలిస్తే.. భవిష్యత్తులో తుఫానులు, దాని ద్వారా సంభవించే పిడుగుపాటులు అధికం అవుతాయని భూ విజ్ఞాన శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ నాయర్ రాజీవన్ అభిప్రాయపడ్డారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా ఉష్ణ ప్రసరణ లేదా ఉరుములతో కూడిన మేఘాల ఏర్పాటు జరుగుతున్నదని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ పరిణామాలే వీటికి కారణమని అన్నారు. వాతావరణ మార్పులతో గాలిలో తేమశాతం అధికమవుతుందని, దీంతో దట్టమైన మేఘాలు ఎక్కువగా ఏర్పడతాయని అన్నారు. ఐఎండీ మాజీ చీఫ్ కేజే రమేశ్ మాట్లాడుతూ.. ఆకాశంలో నల్లటి మేఘాలు ఏర్పడి కమ్ముకొస్తున్నట్టు గమనించిన వెంటనే ఆరు